సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం । 1 । నవంబర్ । 2023



పార్టీల తీరుతో అన్యాయం
రాజకీయ పార్టీల తీరుతో తమకు అన్యాయం జరుగుతుందని మందకృష్ణ అన్నారు.

వివరాలు 12లో ▸



ఇసుక తరలింపు అడ్డగింత
మూసాపేట మండలంలోని పెద్దవాగులో ఇసుక తరలింపును రైతులు అడ్డుకున్నారు.

వివరాలు 12లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /19.7

వాతావరణం
రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జోగులాంబను దర్శించుకున్న మల్కాజ్‌గిరి కలెక్టర్



అలంపూర్: జోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను మేడ్చల్– మల్కాజ్‌గిరి కలెక్టర్ డి.అమోయ్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయాలకు వచ్చిన కలెక్టర్‌ను అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి



గద్వాల క్రైం: సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎస్పీ రితిరాజ్ అన్నారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకొని ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ సంరక్షణ, సమగ్రత కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివి అన్నారు. వందలాది సంస్థలను ఒక్కటి చేసిన మహనీయుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. భారతదేశంలో కలవడానికి ఇష్టపడని హైదరాబాద్ ప్రాంతాన్ని సైనిక చర్య ద్వారా దేశంలో కలిపి ఇక్కడి ప్రజల మన్ననలు పొందారన్నారు. అనంతరం ప్రతిఒక్కరిలో ఐక్యతా భావం పెంపొందించేలా సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ, సైకిల్ ర్యాలీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, ఇమ్మాన్యుయల్ తదితరులు పాల్గొన్నారు.

క్వింటా వేరుశనగ రూ.7,031

గద్వాల వ్యవసాయం: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 465 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. గరిష్ఠంగా రూ.7,031, కనిష్ఠంగా రూ.3,650, సరాసరిగా రూ.5,800 ధర పలికాయి. అలాగే 37 క్వింటాళ్ల ఆముదం రాగా.. గరిష్ఠంగా రూ.5,379, కనిష్ఠంగా రూ.3,619, సరాసరిగా రూ.5,379 వచ్చాయి.



బహిరంగసభ వేదికపై మల్లురవి, చిన్నారెడ్డి, సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, వి.హనుమంత్‌రావు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు, జగదీశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వంశీచంద్‌రెడ్డి, తదితరులు

రాజకీయ బంధం కాదు.. కుటుంబ బంధం

'పాలమూరు ప్రజాభేరి' బహిరంగసభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

- దొరల తెలంగాణ కావాలా.. ప్రజల తెలంగాణ కావాలా?
- బీజేపీకి ఓటు వేస్తే బీఆర్‌ఎస్‌కే పడుతుంది
- కాంగ్రెస్‌కు ప్రజా బలం ఉంది.. కార్యకర్తలు ఎవరికీ భయపడరు



ప్రజలకు అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ ప్రజలతో తనది రాజకీయ బంధం కాదని, కుటుంబ బంధం అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో కాంగ్రెస్ నిర్వహించిన 'పాలమూరు ప్రజాభేరి' భారీ బహిరంగసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దొరల తెలంగాణ కావాలో.. ప్రజల తెలంగాణ కావాలో ఇప్పటికే నిర్ణయించుకున్నట్లు తెలుస్తోందన్నారు. పేదలు, రైతులు, కార్మికులకు చెందిన రూ.లక్ష కోట్లను సీఎం కేసీఆర్ దోచుకున్నారని, ఆ సొమ్మునంతా వసూలు చేసి పేదల జేబులు నింపుతామని చెప్పారు. కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు, బీఆర్‌ఎస్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాలను చూసి ఏవి పటిష్ఠమైనవో గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఏడాది గడవక ముందే కాళేశ్వరం బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించారు. 2040 వరకు రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఏటా రూ.31 వేల అప్పు కట్టాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ హయాంలో దళిత, గిరిజనులకు ఇచ్చిన భూములను ధరణి పేరుతో సీఎం కేసీఆర్ లాక్కుంటున్నారని ఆక్షేపించారు. డబ్బులు, అధికారం బీఆర్‌ఎస్‌కు ఉంటే కాంగ్రెస్‌కు ప్రజాబలం ఉందని అన్నారు. భయపెట్టాలని చూసినా.. కార్యకర్తలు ఎవరికీ భయపడరు. ప్రజల ప్రభుత్వం నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. మహిళలకు నెలకు రూ.2,500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద కౌలు రైతులతో సహా ఏటా రూ.15 వేలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.4 వేల పెన్షన్, రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని పునరుద్ఘాటించారు. ఇప్పటికే కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో మొదటి కేబినెట్ సమావేశంలోనే ఒక్క సంతకంతో హామీలన్నీ అమలుపర్చామని వివరించారు. తన సోదరి ప్రియాంక కొల్లాపూర్ సభకు రావాల్సి ఉండగా.. అనారోగ్య కారణాలతో రాలేకపోయారని చెప్పారు. సోదరి ప్రియాంక ఇచ్చిన మాట ప్రకారం తాను పాలమూరు ప్రజల వద్దకు వచ్చానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, వి.హన్మంతరావు, ఏఐసీసీ కార్యదర్శులు వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థులు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ బహిరంగసభకు హాజరైన ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు

వలసలు, ఆత్మహత్యలు ఆగలే

సీఎం కేసీఆర్ పాలనలో పాలమూరులో వలసలు, ఆత్మహత్యలు ఆగలేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి పదేళ్లయినా పాలమూరు, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులు పూర్తిచేయలేదని విమర్శించారు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. 'నల్లమల బిడ్డను.. ఇక్కడే పుట్టిన.. ఇక్కడే చస్తా.. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అభ్యర్థులకు కాంగ్రెస్ బీఫారాలను అందించే అవకాశం సోనియా నల్లమల బిడ్డకు ఇచ్చిందని, ఇక్కడి బిడ్డ కీలక పదవుల్లో ఉంటేనే ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని, ఉమ్మడి జిల్లాలోని మొత్తం 14 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించి అండగా నిలబడాలి' అని రేవంత్ కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సోనియాగాంధీ చెప్పిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు.

ఒక్క చుక్క తేలేదు

నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో దశాబ్దకాలంగా ఒక్క చుక్క నీరు కూడా అదనంగా బీఆర్‌ఎస్ తీసుకురాలేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. నీరు తీసుకురాని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కృష్ణానదిలో ముంచాలని కోరారు. ఒక పక్క గోదావరి.. మరోపక్క కృష్ణానది మధ్యలో ఉన్న దక్కన్ పీఠభూమి సస్యశ్యామలం కావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీశైలం, కల్వకుర్తి, నెట్టెంపాడు, జూరాల, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారానే వ్యవసాయ పొలాలకు నీళ్లు పారుతున్నాయని చెప్పారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఇక్కడి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌కు ద్రోహం చేసి పార్టీ మారారని, ఈ ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పాలని కోరారు.

ప్రజాస్వామ్యం పాతాళానికి..



కొల్లాపూర్: కేసీఆర్ పాలనలో ప్రజాస్వామ్యం పాతాళానికి పడిపోయిందని, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కేసీఆర్ కుటుంబానికి రూ.వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి.. ఏం వ్యాపారాలు చేశారు.. ఏ ఫ్యాక్టరీలు కట్టి సంపాదించారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే రాష్ట్రాన్ని కేసీఆర్ నాశనం చేశారన్నారు. తెలంగాణకు కాపలా కుక్క అన్న కేసీఆర్ రూ.1.80 లక్షల కోట్ల టెండర్లలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన నెహ్రూ, ఇందిర కుటుంబానికి.. కేసీఆర్ కుటుంబానికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పాలమూరు పౌరుషానికి.. కేసీఆర్ అవినీతికి మధ్య జరుగుతున్న పోటీ ఇది అన్నారు. డబ్బు సంచులకు ఇక్కడ అమ్ముడుపోయే వాళ్లు ఎవరూ లేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అవినీతి లేదంటూనే స్థానిక ఎమ్మెల్యేకు రూ.5 లక్షల బకాయిలకు రూ.26 కోట్లు పార్టీ మారినందుకు లంచంగా ఇచ్చారని ఆరోపించారు.

ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు



గద్వాల రూరల్: వానాకాలంలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన ఐడీఓసీ కార్యాలయంలో తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 35,718 హెక్టార్లలో వరి పంట సాగు చేశారన్నారు. ఇందుకు సంబంధించి రైతులు పండించిన ప్రతిగింజను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఇందుకోసం జిల్లాలో మొత్తం 74 కొనుగోలు ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏ– గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,143 మద్దతు ఇవ్వనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన తేమ మిషన్లు, గన్నీ బ్యాగులు, కాంటాలు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు అన్నీ కూడా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ రేవతి, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, డీఎం విమల, డీఆర్‌డీఓ ఉమాదేవి, డీసీఓ ప్రసాద్‌బాబు, ఆర్డీఓ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్చర్ల, కల్వకుర్తిలో రాహుల్ సభలు

జడ్చర్ల: ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ వరుసగా ఉమ్మడి జిల్లాలో బుధవారం రెండో రోజు పర్యటించనున్నారు. మొదట కల్వకుర్తిలో మధ్యాహ్నం 2 గంటలకు కార్నర్ మీటింగ్‌లో పాల్గొని, సాయంత్రం జడ్చర్లకు చేరుకుంటారు. అక్కడ అంబేద్కర్ చౌరస్తాలో సాయంత్రం 4 గంటలకు కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేసేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు.

- అంబేద్కర్ చౌరస్తాలో రాహుల్‌గాంధీ సభ ఉండటంతో వాహనాల రాకపోకలను దారి మళ్లించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. నాగర్‌కర్నూల్, వనపర్తి వైపు వెళ్లే వాహనాలను బిజినేపల్లి, భూత్పూర్‌ల మీదుగా 44వ నంబర్ జాతీయ రహదారిపైకి దారి మళ్లించే విధంగా ఏర్పాట్లు చేశారు. కల్వకుర్తి వైపు వెళ్లే వాహనాలను గంగాపూర్, పట్టణ శివార్లలోని వెంచర్ల గుండా కావేరమ్మపేట మీదుగా దారి మళ్లిస్తున్నారు.

బకాయిల మోత



గద్వాల మున్సిపల్ కార్యాలయం

జిల్లాకేంద్రంలో యథేచ్ఛగా పన్నుల ఎగవేత

- వసూళ్లలో పాలకవర్గాల ఉదాసీనత, అధికారుల నిర్లక్ష్యం
- ప్రగతికి అవరోధంగా మారుతున్న రాజకీయ జోక్యం
- సిబ్బందికి నెల జీతాలు చెల్లించలేని స్థితిలో మున్సిపాలిటీ

గద్వాల: జిల్లాకేంద్రమైన గద్వాల మున్సిపాలిటీలో సుమారు 90 వేల జనాభా.. వాణిజ్యపరంగా.. ప్రాధాన్యతా క్రమంలో.. ఘన చరిత్రను సొంతం చేసుకున్న గద్వాల పట్టణం.. అభివృద్ధి సాధనకు ఆదాయ వనరులను మాత్రం సమకూర్చుకోలేకపోతోంది. పన్నుల ఎగవేత.. పాలకవర్గాల ఉదాసీనత, అధికారుల నిర్లక్ష్యం.. మితిమీరిన రాజకీయ జోక్యం.. అవకతవకలు వంటి పరిస్థితులు ప్రగతికి అవరోధాలుగా నిలుస్తున్నాయి. ఒక్క 2023– 24 సంవత్సరంలోనే రూ.6.63 కోట్ల మేర బకాయిలు పేరుకుపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

బకాయిల వివరాలు ఇలా..	
ఆస్తి పన్ను (గృహాలు) : రూ.4.18 కోట్లు	
ఆస్తిపన్ను (ప్రభుత్వ కార్యాలయాలు) : రూ.1.43 లక్షలు	
నీటి బకాయిలు : రూ.20 లక్షలు	మార్కెట్ వేలాలు : రూ.47 లక్షలు
షాపుల అద్దెలు : రూ.35 లక్షలు	

ప్రతినెలా గండంగానే..

ఏటా సిబ్బంది జీతాలకు రూ.5.40 కోట్లు అవసరం. అలాగే వాహనాల ఇంధనం, ట్రాక్టర్ల నిర్వహణ తదితర ఖర్చులు ఏడాదికి సుమారు రూ.కోటి కావాలి. ఏటా వసూలు అవుతున్న పన్నులు 60 శాతం మించి లేవు. మిగిలిన 40 శాతం పన్నులు బకాయిలుగా మిగులుతున్నాయి. దీంతో మున్సిపాలిటీలో కార్మికుల వేతనాల చెల్లింపు ప్రతినెల గండమే. కనీసం రెండు, మూడు నెలలు ఆగితే తప్ప జీతాలు అందుకునే అవకాశం లేకుండా పోతుంది. ఎప్పటికప్పుడు కార్మికుల జీతాల కోసం సమ్మె చేయాల్సి వస్తోంది. పన్నుల వసూలు త్వరితగతిన సాగక ఈ పరిస్థితికి కారణమవుతుంది. ఇప్పటికే కార్మికులకు రెండు నెలల వేతనాలు అందాల్సి ఉంది.

బకాయిలపై దృష్టిసారిస్తాం..



మున్సిపాలిటీలో పేరుకుపోయిన బకాయిలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించి పన్నులతోపాటు బకాయిలను, అద్దెలను వసూలు చేస్తాం. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ప్రజలు సైతం సకాలంలో పన్నులు, బకాయిలు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.
– నర్సింహ, మున్సిపల్ కమిషనర్, గద్వాల

ఆ మూడే కారణం..

పన్నుల వసూలు కుంటుపడటానికి సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం.. రాజకీయ ఒత్తిళ్లు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. క్రమం తప్పకుండా చెల్లించే వారిని తప్ప మిగతా వారి జోలికి వెళ్లడం లేదు. పలువురి రాజకీయ నాయకులు, వ్యాపారులు తదితరులు చెల్లించాల్సిన పన్నులు ఏటా రూ.లక్షల్లో పేరుకుపోతున్నాయి. కార్మికుల జీతాల కోసం ఆందోళన చేసిన సందర్భాల్లో మాత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ముమ్మరం చేస్తున్నారు. మరోదిక్కు పరిమితంగా ఉన్న మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకోవడానికి అధికారులు చేస్తున్న ప్రయత్నాలు శూన్యం. ఆస్తుల ద్వారా వస్తున్న నామమాత్ర అద్దెలు కూడా ఎప్పటికప్పుడు వసూలు చేయకపోతున్నారు. భవన, అక్రమ నల్లా కనెక్షన్ల క్రమబద్ధీకరణలోనూ నిర్లక్ష్యమే కనిపిస్తోంది.

అభివృద్ధికి దారేది?

ఏటా మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయం సిబ్బంది జీతాలకే సరిపోవడం లేదు. దీంతో పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కోసం మున్సిపల్ నిధుల నుంచి కేటాయింపులకు అవకాశమే లేకుండా పోతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్దుల కింద మంజూరు చేసే అరకొర నిధులే శరణ్యమవుతున్నాయి.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

గద్వాల రూరల్/ ఎర్రవల్లి చౌరస్తా: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులందరూ కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం ఆమె జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులతోపాటు ఎర్రవల్లిలోని ఏకశిల పాఠశాలలో అలంపూర్ నియోజకవర్గంలో ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులకు అందిస్తున్న శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో కలెక్టర్ మాట్లాడుతూ పీఓ, ఏపీఓలు ప్రతిఒక్కరు ఈవీఎం యంత్రాలు, ఎన్నికల నిర్వహణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ఎన్నికల విధులకు సంబంధించి ప్రతిఒక్కరు కూడా పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటే ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగవన్నారు. ఎన్నికల మార్గదర్శకాలు, నిబంధనలు స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. శిక్షణ పొందిన పీఓ, ఏపీఓలు పోలింగ్ బూత్‌లతో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని, ఎలాంటి సందేహాలున్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పోలింగ్ జరిగే సమయంలో పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్లను సీల్ చేయడం తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, శ్రీనివాసులు, ఆర్డీఓ చంద్రకళ, డిప్యూటీ కలెక్టర్ సుబ్రమణ్యం, ఏపీడీ నాగేంద్రం, ఎంపీడీఓలు రాఘవ, రవీంద్ర, తహసీల్దార్ నందిని, మంజుల, ఎంపీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

జాతీయ సమైక్యతా దినోత్సవం

గద్వాల రూరల్: జాతీయ సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత సంస్థానాలు, రాజ్యాలను భారతదేశంలో విలీనం చేసి సమైక్యతను నెలకొలిపిన గొప్ప నాయకుడు వల్లభాయ్ పటేల్ అన్నారు. ఆయన స్ఫూర్తిని కాపాడుకుంటూ మనమంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

అమరుల త్యాగం అజరామరం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ రవి

గద్వాల క్రైం: పోలీసు అమరవీరుల త్యాగం అజరామరమని ఏఎస్పీ రవి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఏఎస్పీ పాల్గొని మాట్లాడారు. పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భంగా ర్యాలీ తీశామన్నారు. దేశవ్యాప్తంగా ప్రజా సంక్షేమం కోసం విధులు నిర్వహిస్తూ అమరులైన పోలీసు సిబ్బంది సేవలు మరువలేనివి అన్నారు. వారి సేవలను గుర్తు చేసుకుంటూ సమ సమాజ స్థాపనకు ప్రతిఒక్కరు చేయూత ఇవ్వాలన్నారు. ఏ సమస్య వచ్చినా ముందుగా పోలీసు ఉన్నాడనే ధైర్యంతో ప్రజలు నమ్మకంగా ఉన్నారన్నారు. విపత్కర సమయాల్లో బాధితులకు మనోధైర్యం ఇవ్వడంతోపాటు వారి అభ్యున్నతికి కృషి చేసేది పోలీస్ శాఖ అన్నారు. సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజలతో మరింత చేరువ కావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ ఇమ్మానుయల్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు ఆనంద్, వెంకటేష్, శ్రీకాంత్, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి : సీపీఐ

పెబ్బేరు రూరల్: ఉల్లిగడ్డ, కందిపప్పు, పచ్చి మిర్చి, మంచినూనె తదితర నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులు కొనలేనంతగా పెరిగాయని.. వెంటనే తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యురాలు, భారత జాతీయ మహిళా అధ్యక్షురాలు పి.కళావతమ్మ డిమాండ్ చేశారు. సాధారణంగా ఉల్లి కిలో రూ.10 నుంచి రూ.15 ఉండేదని.. ప్రస్తుతం రూ.100కు పెరిగిందని, కందిపప్పు రూ.120 నుంచి రూ.200కు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టమాటా కిలో రూ.200కు పెంచి దళారులు దోచుకున్నారని.. ఇప్పుడు ఉల్లిగడ్డ ఆ కోవలో చేరిందన్నారు. దిగుబడి తగ్గటమే కాకుండా కృత్రిమ కొరత సృష్టించడం కారణమని.. ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. దీపావళికి రేషన్ దుకాణాల ద్వారా ఉల్లిగడ్డ, పప్పు, నూనె రాయితీపై పంపిణీ చేసి సామాన్యులపై భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.


హత్యాయత్నాన్ని ఖండించేది పోయి హేళన చేస్తారా?

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించాల్సింది పోయి హేళన చేసే మాటలు మాట్లాడడం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికే దక్కిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దాడి ఖండించకుండా కోడి కత్తి మెండి కత్తి అని దుర్మార్గంగా మట్లాడడం ఆయన మానసిక స్థితిని తెలుపుతుందన్నారు. ఇలాంటి వారికి పొరపాటున అధికారం ఇస్తే ఏమైతుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులు చేయించడం, వాటిని సమర్థించుకోవడం ఎంత వరకు సబబని అన్నారు. రాష్ట్రంలో కచ్చితంగా తమ పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తుందని కేసీఆర్ సీఎం అవుతారని చెప్పారు. తమ పార్టీకి లక్షల మంది కార్యకర్తల బలగం ఉందని, మేము అనుకుంటే ఒక్క క్షణంలో ఇలాంటి వారికి గుణపాఠం చెప్పగలమని అన్నారు. హింస ద్వారా భయపెట్టాలని ప్రయత్నిస్తే ప్రజలు హర్షించరని అన్నారు. విద్వేష రాజకీయలు చేయడం కాదని, అభివృద్ధి చేసి ప్రజల మనసులు గెలుచుకోవాలన్నారు. ప్రభాకర్‌రెడ్డి ప్రాణాలను కాపాడిన గన్‌మెన్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

దేవరకద్ర.. ఎవరి ముద్ర !

బీసీ వర్గాల ప్రాబల్యం అధికంగా ఉన్న దేవరకద్ర నియోజకవర్గంలో రెడ్డి వర్గ నేతల హవా కొనసాగడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సెగ్మెంట్‌లో ఇప్పటివరకు మూడు పర్యాయాలు ఎన్నికలు జరగగా.. ఆ వర్గానికి చెందిన నేతలే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో సైకిల్, స్వరాష్ట్రంలో కారును ఆదరించిన ప్రజలు అభివృద్ధికే జైకొడుతూ వస్తున్నారు. 2014, 2018 వరుస ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విజయం సాధించగా.. ఈ ఎన్నికల్లో సైతం గెలిచి హ్యాట్రిక్ సాధించే దిశగా ప్రచారం ముమ్మరం చేశారు. ప్రభుత్వ వ్యతిరేకత తదితర అంశాలపై ప్రత్యేక నజర్ వేసిన కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తుండగా.. ఆ పార్టీలో అసమ్మతి రాగం వేధిస్తోంది. బీజేపీ సైతం అదే పంథాలో ముందుకు సాగుతుండడంతో ఈ సారి హోరాహోరీ పోరు తప్పదని తెలుస్తోంది.

– దేవరకద్ర



2023 ఓట్ గ్రాఫ్..

పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	స్త్రీ ఓటర్లు
285	1,13,528	1,14,556

మొత్తం ఓటర్లు 2,28,084

పోల్ గ్రాఫ్..	2014	2018
మొత్తం పోలైన ఓట్లు	1,50,024	1,74,426
మెజార్టీ	16,922	35,248
గెలుపొందిన అభ్యర్థి	ఆల వెంకటేశ్వర్‌రెడ్డి (టీఆర్‌ఎస్)	ఆల వెంకటేశ్వర్‌రెడ్డి (టీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు	66,354 (44.23%)	96,130(55.12%)
సమీప ప్రత్యర్థి	దోకూరు పవన్ కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)	దోకూరు పవన్ కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)
వచ్చిన ఓట్లు	49,432 (32.95%)	60,882(34.91%)

ఇప్పటివరకు 3 పర్యాయాలుగా ఎన్నికలు

- తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్‌ఎస్‌దే హవా
- 2 దఫాలుగా 'ఆల'కే ఆశీర్వాదం..
- ఈ సారి ప్రత్యేక నజర్ వేసిన కాంగ్రెస్
- అభ్యర్థి ఖరారుతో 'చేతి'లో అసమ్మతి రాగం
- దోకూరు పోటీకి విముఖతతో బీజేపీలో అంతర్మథనం

జంగ్ తెలంగాణ

'ఆల'కే ఆశీర్వాదం..



2009లో దేవరకద్ర నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు మూడు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. తొలి ఎన్నికల్లో ప్రధానంగా టీడీపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ కొనసాగింది. పొత్తులో భాగంగా టీఆర్‌ఎస్ పోటీ చేయలేదు. టీడీపీ నుంచి పోటీ చేసిన సీతాదయాకర్‌రెడ్డికి 58,476 ఓట్లు పోలయ్యాయి. ఆమె సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన స్వర్ణ సుధాకర్‌రెడ్డికి 39,540 ఓట్లు రాగా.. సీతాదయాకర్‌రెడ్డి 19,036 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థి రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన జేపీఎన్సీ రవికుమార్ మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014, 2018 ఎన్నికలు కొత్త రాజకీయ శకాన్ని చూపించాయి. రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించారు.

2018.. రికార్డ్ పోలింగ్, రికార్డ్ మెజార్టీ..

2009లో ఎన్నికల్లో దేవరకద్ర నియోజకవర్గంలో 1,41,698 ఓట్లు (68.68 శాతం) పోలయ్యాయి. టీడీపీ నుంచి పోటీ చేసిన సీతాదయాకర్‌రెడ్డికి 41.40 శాతం ఓట్లు రాగా.. ఆమె 19,036 ఓట్లతో సమీప ప్రత్యర్థిపై గెలుపొందారు. 2014 ఎన్నికల్లో 1,50,024 మంది (71.40 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి 66,354 ఓట్లు (44.23 శాతం) రాగా.. 16,922 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో నియోజకవర్గ చరిత్రలో అత్యధికంగా 1,74,426 ఓట్లు (85.11శాతం) పోలయ్యాయి. ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి 96,130 ఓట్లు (55.12 శాతం) రాగా.. ఆయన 35,248 ఓట్ల ఆధిక్యంతో విజయకేతనం ఎగురవేశారు. 2018లో రికార్డ్ పోలింగ్‌తో పాటు అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యేగా ఆల రికార్డుల్లోకి ఎక్కారు.



దేవరకద్ర నియోజకవర్గ కేంద్రం

నియోజకవర్గం: దేవరకద్ర
మండలాలు: 8 (దేవరకద్ర, చిన్నచింతకుంట, భూత్పూర్, అడ్డాకల్, కొత్తకోట, మూసాపేట్, మదనాపురం, కౌకుంట్ల)
మున్సిపాలిటీలు: కొత్తకోట, భూత్పూర్
మొత్తం పంచాయతీలు: 141
అత్యంత ప్రభావిత పంచాయతీ: దేవరకద్ర

భౌగోళిక పరిస్థితులు: వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. భూత్పూర్ నుంచి కొత్తకోట మండలం వరకు ఎన్‌హెచ్-44, దేవరకద్ర మీదుగా167 జాతీయ రహదారి..

ప్రధాన పరిశ్రమలు: కోజెంట్ గ్లాస్, స్నేహ చికెన్ ఎగుమతులలు, షుగర్ పరిశ్రమలు, రెండు స్పిన్నింగ్ మిల్లులు, బీడీ ఫ్యాక్టరీలు, మెగా ఎలక్ట్రిక్ ఇంజినీరింగ్, కోళ్ల దాణా, సీడ్స్ కంపెనీలు, కాటన్ మిల్లు

పర్యాటకం: కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్, సరళసాగర్ ప్రాజెక్ట్ (ఆసియాలోనే మొదటి, ప్రపంచంలో రెండో సైఫన్ సిస్టం ప్రాజెక్టు)





ప్రధాన సాగు నీటి వనరులు: కోయిల్‌సాగర్, సరళసాగర్, శంకరసముద్రం, ఏనుకుంట రిజర్వాయర్, పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లో భాగంగా భూత్పూర్ మండలంలో కర్వెన రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయి.

ప్రధాన విద్యాసంస్థలు: అన్ని మండలాల్లో కస్తూర్బా పాఠశాలలు, మైనార్టీ, బీసీ, ఎస్సీ, బాలుర, బాలికల గురుకులాలు, దేవరకద్ర, భూత్పూర్, అడ్డాకుల, చిన్నచింతకుంట, కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మదనాపురంలో కృషి విజ్ఞాన కేంద్రం. దేవరకద్ర జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కళాశాల (రంగారెడ్డి జిల్లాలో ఉంది. ఇంకా ఇక్కడికి షిఫ్ట్ కాలేదు)

ప్రభావితం చేసే వర్గాలు: కుర్వ, ముదిరాజ్, ఉప్పరి, బోయ

ఆలయాలు: చిన్నచింతకుంట మండలంలో పేదల తిరుపతిగా పిలిచే కురుమూర్తిస్వామి, అడ్డాకుల మండలం కందూరులో రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. కాశీ తర్వాత కల్పవృక్షాలు ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత..



2 సార్లు.. రెండో స్థానంలో దోకూరు

2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన దోకూరు పవన్‌కుమార్ రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. 2014లో ఆయనకు 49,432 ఓట్లు (32.95 శాతం) రాగా.. 2018లో 60,882 ఓట్లు (34.91 శాతం) పోలయ్యాయి. అనంతర పరిణామాల క్రమంలో ఆయన బీజేపీలో చేరారు. ప్రస్తుతం దోకూరు పోటీలో ఉంటారా అనే దానిపై మీమాంస కొనసాగుతోంది. ఆయన బరిలో దిగని పక్షంలో గత ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేసిన ఎగ్గని నర్సిములుతో పాటు సుదర్శన్‌రెడ్డి బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది. వీరితోపాటు దేవరకద్ర బాలన్న, బాలకృష్ణ పేర్లు విన్పిస్తున్నాయి. అదేవిధంగా కాంగ్రెస్ టికెట్ మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి(జీఎమ్మార్)కు కేటాయించగా.. టీపీసీసీ నాయకులు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, కొండా ప్రశాంత్ రెడ్డి అసమ్మతి రాగం అందుకున్నారు. స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రదీప్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. బీఆర్‌ఎస్‌లో అభ్యర్థిత్వాల ఖరారు పూర్తి కాగా.. నెలన్నర క్రితమే నియోజకవర్గంలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రచారం ప్రారంభించగా శ్రేణుల్లో జోష్ నెలకొంది. దాదాపుగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రెండు పర్యాయాలు అన్ని మండలాలను చుట్టి వచ్చారు. అయినా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థిత్వాలు ఇంకా ఖరారు కాకపోవడంపై ఆయా పార్టీల శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది.

జిల్లాల విభజన.. గజిబిజి

2009 నియోజకవర్గాల పునర్విభజనలో దేవరకద్ర కొత్త సెగ్మెంట్‌గా ఏర్పడింది. అంతకు ముందు అమరచింత నియోజకవర్గంలో దేవరకద్ర మండలం ఉండేది. ఐదు మండలాలతో (దేవరకద్ర, చిన్నచింతకుంట, భూత్పూర్, అడ్డాకుల, కొత్తకోట) కొత్తగా ఏర్పడిన దేవరకద్ర నియోజకవర్గానికి అదే సంవత్సరంలో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో ఈ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ఎన్నికలు నిర్వహించారు. 2016లో జిల్లాలు, మండలాల పునర్విభజన తర్వాత ఈ నియోజకవర్గంలో రెండు కొత్త మండలాలు (మూసాపేట, మదనాపురం) ఏర్పాటయ్యాయి. దీంతో పాటు మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని రెండు గ్రామాలు భూత్పూర్ పరిధిలోకి వచ్చాయి. అయితే 2009 నియోజకవర్గాల పునర్విభజన ప్రకారమే ఎన్నికలు జరిగాయి. ఇటీవల కొత్తగా కౌకుంట్ల మండలం ఏర్పాటైంది. జిల్లాలు, మండలాల పునర్విభజన తర్వాత మదనాపురం, కొత్తకోట వనపర్తి జిల్లాలో చేరాయి.

ప్రజాభేరి సక్సెస్

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలమూరు ప్రజాభేరి సభ సక్సెస్ అయింది. సభకు ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ హాజరు రావాల్సి ఉండగా, అనారోగ్యం కారణంగా ఆమె పర్యటన వాయిదా పడింది. ఈ విషయం మీడియాలో రావడంతో కాంగ్రెస్ శ్రేణులు నిరాశ చెందారు. కొద్ది సేపటికే ప్రియాంకకు బదులుగా రాహుల్‌గాంధీ వస్తున్నారని సమాచారం అందడంతో నూతనోత్సాహంతో సభకు తరలివచ్చారు.

– కొల్లాపూర్



రాహుల్‌గాంధీ, భట్టి విక్రమార్కతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సరిత, అనిరుధ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, చిన్నారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

సభ సైడ్‌లైట్స్

- సాయంత్రం 5:40 గంటలకు హెలిక్యాప్టర్‌లో రాహుల్‌గాంధీ సభ వద్దకు చేరుకున్నారు.
- 6.20 గంటలకు రాహుల్‌గాంధీ ప్రసంగం ప్రారంభమై 6:31 నిమిషాలకు ముగిసింది.
- ప్రసంగం ముగిశాక ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి రాహుల్‌గాంధీ ప్రజలకు అభివాదం చేశారు. అభ్యర్థులందరినీ రేవంత్‌రెడ్డి పరిచయం చేశారు.
- సభకు కొంత ఆలస్యంగా వచ్చిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన వెంట వచ్చిన జడ్చర్ల కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డిని రాహుల్‌గాంధీకి ప్రత్యేకంగా పరిచయం చేశారు.
- సభ ముగిశాక రాహుల్‌గాంధీ రోడ్డు మార్గం గుండా తిరుగు ప్రయాణమయ్యారు.
- రాహుల్‌గాంధీకి ట్రాన్స్‌లేటర్‌గా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వ్యవహరించారు.
- ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించిన మూడు నిమిషాల వ్యవధిలోనే రాహుల్‌గాంధీ రావడంతో ఆయన ప్రసంగం ముగించేశారు. రాంగ్ టైంలో మైక్ ఇచ్చారనుకుంటూ తన సీటులో కూర్చున్నారు.
- కొల్లాపూర్‌లో టికెట్ ఆశించి భంగపడ్డ చింతలపల్లి జగదీశ్వర్‌రావును వెంట బెట్టుకొని జూపల్లి కృష్ణారావు సభకు విచ్చేశారు.
- రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలతో హోరెత్తించారు.
- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రజాభేరి సభకు వచ్చారు.



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాహుల్‌గాంధీ



సభకు వస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కళాకారుల ఆటాపాట

రూ.15.7 లక్షల నగదు సీజ్



కృష్ణా మండలం చేగుంట చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన నగదు



మద్దూరులో పట్టుబడ్డ నగదును చూపుతున్న ఏఎస్‌ఐ ఉస్మాన్

వనపర్తి/కృష్ణా/మద్దూరు/చిన్నచింతకుంట: ఎన్నికల వేళ పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. మంగళవారం వివిధ ప్రాంతాలకు తరలుతున్న నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేశారు.

- వనపర్తి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.1.50 లక్షల నగదు, 15 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు.
- రాయచూర్ జిల్లా మాన్వికి చెందిన రాజశేఖర్ కారులో రూ.11లక్షల నగదు తరలిస్తుండగా, నారాయణపేట జిల్లా కృష్ణా మండలం చేగుంట చెక్‌పోస్టు వద్ద పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు.
- మద్దూరు మండల కేంద్రంలో నారాయణపేటకు చెందిన గూడూరు వంశీ రూ.లక్ష 40వేలు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.
- మహబూబ్‌నగర్‌కు చెందిన లాల్ బహదూర్‌శాస్త్రి రూ.లక్ష 17వేలు తరలిస్తుండగా, చిన్నచింతకుంట మండలం లాల్‌కోట చౌరస్తా చెక్‌పోస్టు వద్ద పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. చేసినట్లు ఎస్సై ఆర్ శేఖర్ తెలిపాడు.

60 స్థానాల్లో సేవాలాల్ సేన పోటీ

కల్వకుర్తిరూరల్: శాసనసభ ఎన్నికల్లో సేవాలాల్ సేన 60 జనరల్ స్థానాల్లో పోటీ చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్ చెప్పారు. కల్వకుర్తి పట్టణంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, నారాయణపేట, గద్వాల, జడ్చర్ల, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో పోటీ చేస్తామన్నారు. గిరిజన జనాభా 30వేలు ఉన్న ప్రతి సెగ్మెంట్‌లో తాము పోటీలో ఉంటామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభ్యర్థిగా రేఖ్యానాయక్ పోటీ చేస్తారని చెప్పారు. అనేక ఉద్యమాలు, 1200మంది విద్యార్థులు ఆత్మ బలిదానాలు చేసుకుని సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనకబాటుకు గురైంది గిరిజనులు మాత్రమేనని అన్నారు. సంక్షేమాలు కాకుండా ఉచిత విద్య, వైద్యం, కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో తాము ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఉచితాలపై ఎవరూ ఆలోచించరని రాంబాబునాయక్ అన్నారు. మా తండా, మా రాజ్యం అన్న విధంగానే గిరిజనుల అభివృద్ధి కోసం పోటీ చేస్తున్నట్లు కల్వకుర్తి అభ్యర్థి రేఖ్యానాయక్ తెలిపారు. సమావేశంలో చందునాయక్, మోహన్‌నాయక్, బాలునాయక్, హర్య, శ్రీను, లక్ష్మణ్, జైరాం, రవి ఉన్నారు.



ఐక్యతను చాటుతున్న సేవాలాల్ సమితి నాయకులు

ఒక్క రోజులోనే మార్పు..

రాత్రికి రాత్రే మనసు మార్చుకున్న నాయకులు

నవాబుపేట: ఎన్నికల వేళ పార్టీలలో చేరికలు జోరందుకున్నాయి. ఎవరు ఎప్పుడు ఏ పార్టీ మారుతారో తెలియని పరిస్థితి నెలకొంది. నవాబుపేట మండలం పుట్టోనిపల్లితండాకు చెందిన ఉపసర్పంచ్ చందునాయక్, మాజీ ఎంపీటీసీ లోకేష్‌నాయక్‌లు సోమవారం బీఆర్‌ఎస్‌పై కోపంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. కాగా రాత్రికి రాత్రే మనసు మార్చుకుని మంగళవారం తెల్లవారుజామున ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరుకున్నారు. నిన్న కాంగ్రెస్‌లో చేరిన వారు తెల్లారేసరికి పార్టీ మారడంతో అందరూ అవాక్కయ్యారు. కొన్ని గంటల వ్యవధిలోనే పార్టీలు మారుతుండటం విశేషం.



సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న చందు, లోకేష్



మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో..

జాతీయ రహదారిపై ఏపీ ప్రత్యేక చెక్‌పోస్టు



అలంపూర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పంచలింగాల శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం ఏపీ పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏపీ నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాల తనిఖీ కోసం రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు కర్నూలు పోలీసులు తెలిపారు. ఏపీ చెక్‌పోస్టులో వాహనం ఆపకుండా వెళ్లినా.. అనుమానం వచ్చినా తెలంగాణ సరిహద్దులో ఏర్పాటు చేసిన పుల్లూరు చెక్‌పోస్టు అధికారులకు సమాచారం అందించనున్నట్లు ఏపీ పోలీసులు వివరించారు. ఏపీ చెక్‌పోస్టును కర్నూలు సీఐ శ్రీరామ్, ఎస్‌ఐ బాల్‌నర్సింహ పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రలోభాలకు గురిచేస్తే..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల వేళ మారుతున్న రాజకీయ ఆదిపత్య పరిణామాల నేపథ్యంలో అభ్యర్థులు గెలుపొందేందుకు చేయని ప్రయత్నాలంటూ ఉండవు. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా ఎన్నికల నిబంధనల మేరకు భారతీయ శిక్షాస్మృతి, ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎక్సైజ్ చట్టం ప్రకారం నేరం. ఇలాంటి సందర్భాల్లో వివిధ రకాల కేసులు నమోదవుతుంటాయి. జరిమానాలతో పాటు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు, ధన ప్రవాహం తగ్గించేందుకు, మంచి అభ్యర్థులను చట్టసభలకు పంపించేందుకు ఓటర్లు కూడా చైతన్యవంతులు కావాలి. ఎన్నికల్లో అనైతిక చర్యలకు పాల్పడే అభ్యర్థులు, నాయకులపై సరైన ఆధారాలతో ఫిర్యాదులు చేయాల్సిన బాధ్యత పౌరులు, ఓటర్లపై ఉంది.

కానుకలు ఇవ్వడం నేరమే..


ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అంశాల్లో కానుకలు ఇవ్వడం ఒకటి. మహిళలకు చీరలు, గృహోపకరణాలు ఇవ్వడం, యువకులకు క్రీడాకిట్లు, ఫోన్లు.. ఇలా ఏం ఇచ్చినప్పటికీ ఐపీసీ సెక్షన్ ప్రకారం ఏడాది జైలుశిక్ష, జరిమానా ఉంటుంది.

రెచ్చగొట్టే ప్రసంగాలు వద్దు..

ఎన్నికల్లో కొందరు విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తారు. కులాలు, మతాల పేరిట రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయడం నిషేధం. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుంది. రెండు కూడా విధించవచ్చు. అబద్దాలు చెబుతూ ప్రచారం చేయడం నేరమే అవుతుంది.

మద్యం ఇస్తే...

ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మద్యం పంపిణీని ఎంచుకుంటారు. ఓటర్లకు మద్యం పంపిణీ ఇతర మత్తు పదార్థాలు ఇచ్చినా చట్టప్రకారం నేరమే అవుతుంది. పరిమితికి మించి మద్యం నిల్వలు కలిగి ఉన్నా, విక్రయించడం నేరం. పట్టుబడిన మద్యం, మత్తు పదార్థాల మేరకు ఎక్సైజ్ చట్టం ప్రకారం ఆరు నెలల నుంచి ఏడాది వరకు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. రూ. 5వేల నుంచి రూ. 20వేల వరకు జరిమానా విధిస్తారు.



బెదిరింపులకు పాల్పడినా..

ఎన్నికల నేపథ్యంలో బెదిరింపులకు పాల్పడితే శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అభ్యర్థులు కానీ పార్టీల నాయకులు కానీ ఫలానా పార్టీకి, అభ్యర్థికి ఓటేయాలని బెదిరిస్తే కేసులు నమోదు చేస్తారు. ఏడాది జైలు లేదా జరిమానా లేదా రెండింటిని విధించే అవకాశం ఉంటుంది.

నగదు పంపిణీ చేస్తే..

ఎన్నికల్లో గెలవడానికి అభ్యర్థులు ఓట్లను నోట్లతో కొనుగోలు చేసే ప్రయత్నాలు చేస్తారు. ఓటర్లకు నగదును పంపిణీ చేస్తూ పట్టుబడితే చట్టం ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం కూడా శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED
- Louis Philippe Readymade ShowRoom MBNRలో పనిచేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ మెన్స్, స్టోర్ ఇంఛార్జ్, ఆఫీస్ బాయ్స్ కావలెను. సెల్:8074314712, 9493159185.
- రేమండ్ షోరూమ్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంఛార్జ్, సేల్స్ ఇంఛార్జ్ కావలెను. సెల్:9492801999.
- నర్మద హోండా షోరూం మహబూబ్‌నగర్‌లో పనిచేయుటకు సర్వీస్ మేనేజర్, స్పేర్ పార్ట్స్ ఇంఛార్జి, ఫ్లోర్ సూపర్ వైజర్ కావలెను. సెల్:9493159185.
- రామకృష్ణ గ్రూప్, (TS No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, డ్రైవర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పనిగలను. లో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 18K Ph: 9848571888/9640400073

సాక్షి ద్వారా మీ ఆత్మీయుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు వచ్చిన వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

క్లుప్తంగా...

మోసపూరిత హామీలపై అప్రమత్తంగా ఉండాలి

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక గూటి పక్షులే: డా.కె.లక్ష్మణ్
- కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని బీజేపీ ఖండిస్తోంది



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇస్తున్న మోసపూరిత హామీలపై రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ ఎంపీ, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ సూచించారు. బీఆర్‌ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు ఒక్కసారి మోదీ పాలన చూడాలని... వారసత్వ రాజకీయాలు లేకుండా, అవినీతికి, దళారీలకు అవకాశమే లేకుండా కేంద్రంలో మోదీ అందించిన పాలన రాష్ట్రంలో చూడాలని ప్రజలకు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన లక్ష్మణ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకేగూటి పక్షులని... ఈ రెండు పార్టీల పాలన తెలంగాణ ప్రజలు చూశారన్నారు. బీజేపీ పాలన చూసేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీసీ నేతను ముఖ్యమంత్రి చేస్తానన్న బీజేపీ గురించి ఆలోచించాలన్నారు. కాగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఎంపీ సమాధానమిస్తూ, వివేక్ వెంకటస్వామి పార్టీలోనే ఉంటారని.. మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఆయన చక్కటి మేనిఫెస్టో ఇచ్చారని తెలిపారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని.. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాగా, పవన్ కళ్యాణ్ విదేశీ పర్యటనలో ఉన్నారని.. ఆయన వచ్చాక కార్యాచరణ ప్రకటిస్తామని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

నా ఫేస్‌బుక్ పేజీ హ్యాక్.. ఇన్‌స్టాగ్రామ్ డిలీట్: రుద్రమ

సాక్షి, హైదరాబాద్: తన పేరుతో (రాణీరుద్రమరెడ్డి) ఉన్న ఫేస్‌బుక్ పేజీ హ్యాకింగ్‌కు గురైందని, అదే పేరుతో ఉన్న తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డిలీట్ చేశారని బీజేపీ అధికార ప్రతినిధి, సిరిసిల్ల అభ్యర్థి రాణీరుద్రమ తెలిపారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఐటీ హబ్ కేంద్రంగా విపక్షాల నాయకులు, కార్యకర్తలపై ఈ విధంగా దాడి చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను సిరిసిల్లలో కేటీఆర్ దుర్మార్గాలను సామాజిక మాధ్యమాల ద్వారా బయటి ప్రపంచానికి వెల్లడించకుండా చేయడానికే తన ఖాతాలను హ్యాక్ చేశారన్నారు.

నేడు బీజేపీ మలి జాబితా!

భేటీ కానున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ

- తెలంగాణ జాబితాపై పూర్తయిన కసరత్తు
- జేపీ నడ్డాతో జాబితాపై చర్చించిన కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఉత్కంఠకు తెరలేపిన బీజేపీ మలి జాబితాపై స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరుగనున్న పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో మిగిలిన 66 మంది తెలంగాణ అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కీలక నాయకులు సిద్ధం చేసిన జాబితాకు పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఆమోద ముద్ర వేయనుంది. ఇప్పటికే జనసేనతో పొత్తులు సహా తుది జాబితాపై బీజేపీ పెద్ద ఎత్తున కసరత్తు చేసింది. కాగా మంగళవారం తుది జాబితాపై కిషన్‌రెడ్డి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిగిలిన స్థానాల్లో అభ్యర్థులపై సమీక్షతో పాటు జనసేనతో పొత్తుకు సంబంధించిన అంశాలపై నడ్డాతో కిషన్‌రెడ్డి చర్చించారని సమాచారం.

66 స్థానాలపై వడపోత

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు ఇప్పటికే ఒకసారి భేటీ అయిన సీఈసీ రెండు జాబితాల్లో కలిపి 53 మంది అభ్యర్థిత్వాన్ని ఆమోదం వేసింది. తొలి జాబితాలో 52 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించిన తర్వాత కొన్నిచోట్ల అసంతృప్తి బయటపడింది. రెండో జాబితాలో మహబూబ్‌నగర్ నుంచి ఏపీ మిథున్‌రెడ్డి పేరును బీజేపీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే మిగతా 66 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో కొన్నిచోట్ల భిన్నాభిప్రాయాల నేపథ్యంలో... గత వారం ఢిల్లీ, హైదరాబాద్ వేదికగా రాష్ట్ర నాయకత్వం పలుమార్లు భేటీ అయి అభ్యర్థుల వడపోతను పూర్తి చేసింది. అక్కడ వచ్చిన తుది నిర్ణయాల మేరకు పోటీదారుల జాబితాను సీఈసీకి నివేదించనుంది.

నేటి సీఈసీ సమావేశానికి మోదీ, అమిత్ షా

బుధవారం జేపీ నడ్డా అధ్యక్షతన జరిగే సీఈసీ సమావేశానికి పార్టీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా సహా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, ఇతర సభ్యులు హాజరుకానున్నారు. వీరితో పాటు తెలంగాణ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు బండి సంజయ్ కుమార్, తరుణ్ ఛుగ్, సునీల్ భన్సల్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎన్నికల ఇంఛార్జ్ ప్రకాశ్ జవదేకర్‌లు కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొననున్నారు. బుధవారం సాయంత్రం జరుగనున్న ఈ భేటీ అనంతరం తెలంగాణ మలి జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం ఏ క్షణమైనా విడుదల చేయనుంది.

ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తున్నాం

- పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల ర్యాలీ



పాలస్తీనాకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ జాత్యహంకార దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పలువురు వక్తలు పేర్కొన్నారు. పాలస్తీనాకు ఎలాంటి ఉనికి లేకుండా చేయడం అత్యంత బాధాకరమని, ప్రపంచ దేశాలు ఈ సంఘటనపై స్పందించాలని వారు కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ప్రజాపంథా, న్యూడెమొక్రసీ, లిబరేషన్ తదితర వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సభ జరిగింది. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యదర్శి పోటు రంగారావు, న్యూడెమొక్రసీ నాయకులు వేములపల్లి వెంకటరాములు, సీపీఎం నాయకుడు ఎండీ అబ్బాస్, సీపీఐ జాతీయ నాయకుడు అజీజ్‌పాషా తదితరులు పాల్గొని ప్రసంగించారు. రంగారావు మాట్లాడుతూ అమెరికా మద్దతుతోనే ఇజ్రాయెల్ ఈ దురాక్రమణకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో వేలమంది విగతజీవులుగా మారుతున్నారని వెంకటరాములు ఆవేదన చెందారు. అబ్బాస్ మాట్లాడుతూ పాలస్తీనా ప్రజల హక్కులను కాలరాయడానికే ఇజ్రాయెల్ దాడులు చేస్తోందన్నారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి అంబేడ్కర్ కళాశాల వరకు పాలస్తీనాకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జి.నర్సింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు కె.గోవర్ధన్, మురహరి, జానకిరాములు, గాదగోని రవి, బాలమల్లేశం, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘రజాకార్’తో శాంతిభద్రతలకు భంగం

- చరిత్రను వక్రీకరించి మతతత్వ కోణంలో సినిమాను తీశారు
- ఎన్నికల సంఘం కమిటీ ముందు రావి నారాయణరెడ్డి మనవరాలు వాదనలు

సాక్షి, హైదరాబాద్: చరిత్రను వక్రీకరిస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా తీసిన రజాకార్ సినిమాను అసెంబ్లీ ఎన్నికలకు ముందు విడుదల చేసేందుకు అనుమతించరాదని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి మనవరాలు రావి ప్రతిభారెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మత విద్వేషాలు సృష్టించరాదని ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని 5వ నిబంధన చెబుతోందని గుర్తుచేశారు. అందువల్ల భువనగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గుడూరు నారాయణరెడ్డి నిర్మించిన ఈ సినిమాపై ఎన్నికల కోడ్ కింద చర్యలు తీసుకొనే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉందన్నారు. ఆమె ఫిర్యాదుపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధాన అధికారి లోకేశ్‌కుమార్ నేతృత్వంలోని కమిటీ విచారణ చేపట్టింది. ఈ విచారణకు హాజరైన ప్రతిభారెడ్డి ఈ మేరకు తన వాదనలు వినిపించారు. సినిమాలో వాడిన బతుకమ్మ పాట తెలంగాణ మహిళల మనోభావాలను కించపరిచేలా ఉందన్నారు. కాగా, సినిమా విషయంలో త్వరలో ఎన్నికల సంఘం నిర్ణయాన్ని తెలియజేస్తామని కమిటీ హామీ ఇచ్చిందని ప్రతిభారెడ్డి మీడియాకు తెలిపారు.

పోలీసు అధికారుల బదిలీలు సమీక్షించండి

బీజేపీ నేత శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. హైదరాబాద్ నగర పరిధిలో పోలీసు అధికారుల బదిలీలు జరిగిన తీరును సమీక్షించాలని నగర పోలీస్ కమిషనర్‌కు బీజేపీ ఈసీ వ్యవహారాల కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికార బీఆర్‌ఎస్ పార్టీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఐఎం నాయకులు కోరుకున్నట్టు బదిలీలు జరిగాయని సీపీకి పంపించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ప్రతిని తెలంగాణ (సీఈవో), ఢిల్లీలోని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు మర్రి శశిధర్‌రెడ్డి పంపించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- గురుకుల కళాశాల ప్రిన్సిపాలే కారణమన్న బంధువులు
- ఐదు గంటలపాటు ఆందోళన.. ఉద్రిక్తత



వసుధ (ఫైల్)



ఎక్లార కళాశాలలో ఆందోళన చేస్తున్న వసుధ బంధువులు

మద్నూర్ (జుక్కల్): గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం బంధువుల ఆందోళనతో తీవ్ర ఉద్రిక్తంగా మారింది. విద్యార్థిని మృతికి ప్రిన్సిపాల్ కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో బిచ్కుంద మండలం మానేపూర్‌కు చెందిన దాసరి వసుధ (17) ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఆమె హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కళాశాలకు తిరిగి వెళ్లిన తెల్లారే వసుధ ఆత్మహత్యకు పాల్పడటంతో వసుధ తల్లిదండ్రులు, బంధువులు అనుమానం వ్యక్తం చేశారు.

కాలేజీకి వచ్చిన మరునాడే

దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన వసుధను సోమవారం ఆమె తల్లి అంజవ్వ, మేనమామ మోహన్ కళాశాలలో దింపేసి వెళ్లిపోయారు. ఆ రాత్రి వసుధ భోజనం చేయలేదని, మంగళవారం ఆరోగ్యం బాగాలేదని ప్రార్థనకు రాకుండా హాస్టల్ గదిలోనే ఉండి పోయిందని తోటి విద్యార్థినులు చెప్పారు. తర్వాత వసుధ తరగతి గదికి కూడా రాకపోవడంతో కళాశాల సిబ్బంది హాస్టల్ గదికి వెళ్లి చూశారు. వసుధ చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు కనపడడంతో తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వసుధ మృతికి కళాశాల ప్రిన్సిపాల్ సవిత, సిబ్బందే కారణమంటూ బంధువులు పెద్ద సంఖ్యలో కళాశాలకు చేరుకున్నారు. హాస్టల్ గదుల తలుపులు, కిటికీ అద్దాలను పగలగొట్టి ఐదు గంటలపాటు ఆందోళన చేశారు. పరిస్థితిని గమనించిన పోలీసులు ప్రిన్సిపాల్, సిబ్బందిని ఒక గదిలో ఉంచి గడియ పెట్టి కాపలా ఉన్నారు. బంధువులు తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆ గదిపై చల్లే ప్రయత్నం చేయగా, అక్కడే ఉన్న బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, సీఐ క్రిష్ణలపై పడింది. పోలీసు సిబ్బంది నిలువరించడంతో ప్రమాదం తప్పింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపారు.

మార్కుల కోసం కాలేజీ టార్చర్..

▶ మొదటి పేజీ తరువాయి

వెంటనే అతన్ని సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంట్లో లభించిన సూసైడ్ నోట్‌లో ‘మంచి మార్కులు తెచ్చుకోవాలని టీచర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఒత్తిడి, టార్చర్ చేస్తున్నారు. సారీ అమ్మా నాన్న, తమ్ముడు.. దయచేసి ఎవరూ నారాయణ కళాశాలలో చేరొద్దు. ఇదే నా జీవితంలో చివరి రోజు. దయచేసి విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దు. నా తమ్ముడిని మంచి కళాశాలలో చేర్పించండి. అతని భవిష్యత్తు బావుండాలని కోరుకుంటున్నా. చివరగా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌కు క్షమాపణలు’ అని లేఖలో రాశాడు. దీంతో నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ మృతుడి బంధువులు, స్థానికులు, ఏబీవీపీ నాయకులు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

సిద్దిపేట సీపీ, ఏసీపీలను బదిలీ చేయాలి

- సీఈవోకు బీజేపీ నేత, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: అధికార బీఆర్‌ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతూ బీజేపీపట్ల పక్షపాత వైఖరిని అవలంబిస్తున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్, ఏసీపీలపై కఠినచర్యలను తీసుకొని వారిని అక్కడి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) వికాస్‌రాజ్‌కు బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా కేంద్ర బలగాలను దింపాలని కోరారు. మంగళవారం ఈ మేరకు సీఈవోకు ఫిర్యాదు చేశారు. గతంలోనే సిద్దిపేట పోలీసుల పక్షపాత తీరుపై సీఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. బీజేపీ కార్యకర్తలపై దాడులకు సంబంధించి సీపీ దృష్టికి తెచ్చినా ఏ చర్యా తీసుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఆ పార్టీ నాయకులు అవకాశంగా తీసుకుని బీజేపీ కార్యకర్తల ఇళ్లపై దాడులు చేశారని సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ దాడితో బీజేపీకి ఎలాంటి సంబంధంలేదని స్పష్టంచేశారు. తనకు సెక్యూరిటీ పెంచాలని గతంలోనే డీజీపీని కలిసి విజ్ఞప్తి చేసినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు.

జూరాలలో 6.340 టీఎంసీల నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గడం.. ప్రాజెక్టు పరిధిలోని తాగు, సాగునీటి పథకాలతో పాటు ఆయకట్టు ఇతర అవసరాలకు నిల్వ నీటిని వినియోగిస్తుండటంతో క్రమంగా నీటిమట్టం తగ్గుతూ వస్తోందని పీజేపీ అధికారులు తెలిపారు. ప్రధానంగా ఈ సారి ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీరు చేరలేదు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.340 టీఎంసీలకు నీటిమట్టం చేరినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 1,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 116, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 2,617 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 844.2 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో 844.2 అడుగుల వద్ద 68.5660 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,410, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 918, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 1.775 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి, 3,625 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 175 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గోపాల్‌పేట: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన రేవల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ వివరాల మేరకు.. రేవల్లికి చెందిన టప్ప భీముడు (35) వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులను సరి చేస్తుండగా, విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పార్టీల తీరుతో మాదిగలకు అన్యాయం



సభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కొత్తకోట: రాజకీయ పార్టీల తీరుతో మాదిగలు అన్యాయానికి గురవుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం కొత్తకోట పట్టణంలోని రెడ్డిమార్క్ బీడీ ఫ్యాక్టరీ స్థలంలో నిర్వహించిన మాదిగ విశ్వరూప రథయాత్ర బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చే పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశంపై మాదిగలకు హామీలు ఇస్తున్నాయని, పార్లమెంట్‌లో బిల్లు మాత్రం ప్రవేశపెట్టడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో మాదిగలపైనే ఎక్కువగా కేసులు కావడంతో పాటు ఎంతోమంది అమరులయ్యారని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మాదిగలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఒకశాతం ఉన్న అగ్రవర్ణాలు మంత్రులు అవుతున్నారని, పలుమార్లు ఎమ్మెల్యేలుగా గెలిపొందిన మాదిగలు మాత్రం మంత్రులు కాలేకపోతున్నారన్నారు. మాదిగలకు అన్యాయం చేస్తున్న పార్టీలను నమ్మవద్దన్నారు. మాదిగల భవిష్యత్ కోసం ఎస్సీ వర్గీకరణ ఉద్యమం చేపట్టామని, ఈనెల 18న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ముఖ్యఅతిథిగా ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించామని, పార్టీలకు అతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.ప్రశాంత్, బోయేజ్, ఎస్‌ఆర్ ప్రేమయ్య, మిషేక్, అయ్యన్న, గాడీల ప్రశాంత్, భరత్‌భూషణ్, చెన్నకేశవులు, డేవిడ్‌రాజ్, ప్రేమదానం, సుభాష్, నిక్సన్, కిరణ్, మన్యం, కుమార్ పాల్గొన్నారు.

ప్రజలను నిర్బంధించడం బాధాకరం

- సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేవై రత్నం



తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రొఫెసర్ కేవై రత్నం

మహబూబ్‌నగర్ రూరల్: నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని చిత్తనూర్‌లో ఏర్పాటు చేసిన ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేపట్టిన అమాయక ప్రజలను అరెస్టు చేసి జైల్లో నిర్బంధించడం బాధాకరమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేవై రత్నం అన్నారు. బాధిత కుటుంబాలతో కలిసి మంగళవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ వ్యర్థాలతో గ్రామాలన్నీ కలుషితమవుతాయని అక్టోబర్ 22న ఆందోళన చేపట్టిన గ్రామస్తులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడమే కాక, వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కంపెనీని ఎత్తివేయాలని రెండేళ్లుగా ప్రజలు అనేక రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టినా ఒక్క అధికారి కూడా స్పందించలేదన్నారు. ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం గ్రామసభల తీర్మానం చేయడం వల్ల అధికార పార్టీకి ఓట్లు అడగడం ఇబ్బందికరంగా మారిందని, దీర్ఘకాలిక పోరాటాన్ని అణచివేయడానికి కంపెనీ యజమానులు కుట్ర పన్ని పోలీసులచే ఈ తతంగాన్ని నడిపించారని ఆరోపించారు. చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం గ్రామాలను విడిచి పంట పొలాలు, అడవుల్లో ఉంటున్నారని, గ్రామాల్లో ఉన్నటువంటి ప్రజలను అక్రమంగా అరెస్టు చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. జైల్లో నిర్బంధించిన వారిని విడుదల చేయాలన్నారు. 25ఏళ్లుగా పీడిత ప్రజలు, పర్యావరణం కోసం పనిచేస్తున్న కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి అఖిలభారత కన్వీనర్ బండారి లక్ష్మయ్యతో పాటు అనేక మందిని జైల్లో నిర్బంధించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో శిరీష, సరోజన, జేకే రామారావు, ఈరపాగ గోవింద్, తలారి నరేష్, మోహనకృష్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ సాధించిన అంధ విద్యార్థి

మక్తల్: నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన అంధ విద్యార్థి సర్గం శివకుమార్ పీహెచ్‌డీ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అడిట్ చైర్మన్, సీఈఓ శాంతన్ నారాయణ్, వీసీ డి.రవీందర్ చేతులమీదుగా శివకుమార్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం అతడు ఎస్‌బీఐలో పని చేస్తున్నారు. ప్రొఫెసర్ కావడమే తన లక్ష్యమని తెలిపారు. అంధ విద్యార్థి పీహెచ్‌డీ సాధించడంపై పలువురు అభినందించారు.



శివకుమార్

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం బస్తాల వద్ద ఎస్‌ఐ నరేష్

శాంతినగర్: మండల కేంద్రంలోని రామాలయం చౌరస్తాలో మంగళవారం ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కర్నూల్ వైపు బొలేరోలో తరలిస్తున్న 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన ఎండీ హమీద్ మియా, వడ్డె పరుశరాముడు అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామని, పట్టుబడిన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయగా, పంచనామా నిర్వహించినట్లు పేర్కొన్నారు. బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక తరలింపు అడ్డగింత



వాగులో ట్రాక్టర్లను అడ్డుకుంటున్న తాళ్లగడ్డ గ్రామస్తులు

- బోరుబావులు ఎండుతున్నాయని గ్రామస్తుల ఆందోళన

అడ్డాకుల: మూసాపేట మండలం తాళ్లగడ్డ వద్ద నున్న పెద్దవాగులో ఇసుక తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కమాలొద్దీన్‌పూర్ గ్రామస్తులు ఇసుక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, మంగళవారం ట్రాక్టర్ల ద్వారా వాగు నుంచి ఇసుక తరలింపు చేపట్టారు. అయితే వాగులో ఒకవైపు తాళ్లగడ్డ, మరోవైపు కమాలొద్దీన్‌పూర్ శివారు ఉండగా.. తాళ్లగడ్డ శివారులో ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కమాలొద్దీన్‌పూర్ శివారులో ఇసుక అయిపోవడంతో తాళ్లగడ్డ శివారులోకి వచ్చి వాగును ఖాళీ చేస్తున్నారని తెలిపారు. వాగులో ఇసుక తరలింపుతో బోరుబావులు ఎండిపోతున్నాయని వాపోయారు. అధికారులు స్పందించి వాగులో ఇసుక తరలింపును నిలిపివేయాలని కోరారు.



ఇసుక తరలించడంతో బోరుబావి వద్ద ఏర్పడిన గుంతలు

వాగంతా ఖాళీ!

పెద్దవాగులోని కమాలొద్దీన్‌పూర్ శివారులో అనుమతులతో ఇసుక తరలింపు చేపడితే.. రాత్రివేళ తాళ్లగడ్డ వైపు నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్ల ద్వారా పరిసర గ్రామాలకు ఇసుక తరలించడంతో వాగంతా గుంతలమయంగా మారింది. ఇళ్ల వద్ద ఇసుక డంప్ చేసి, అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. దీనివల్ల భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. బోరుబావుల్లో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతోంది. వేసవిలో పంటలు సాగు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలంపూర్ తహసీల్దార్‌కు బెయిలబుల్ వారెంట్

- నవంబర్ 10న విచారణకు రావాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఓ అభ్యర్థి స్థానికంగా ఉంటున్నట్లు సర్టిఫికెట్ జారీ చేసిన విషయమై కోర్టు ఎదుట అలంపూర్ తహసీల్దార్ హాజరు కాకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తహసీల్దార్‌పై బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను నవంబర్ 10కి వాయిదా వేసింది. తాను తెలంగాణకు చెందిన అభ్యర్థినే అయినా లోకల్ కోటాలో ఎంబీబీఎస్ సీటు ఇచ్చేందుకు కాళోజీ వర్సిటీ నిరాకరించిందని ఎస్.వెన్నెల అనే అభ్యర్థి హైకోర్టులో పిటిషన్ వేశారు. తెలంగాణ మెడికల్, డెంటల్ కాలేజీల అడ్మిషన్(ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో ప్రవేశం) నిబంధన–2017లోని 3(ఐఐఐ) (అ) ప్రకారం విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలంటే అర్హత పరీక్ష(నీట్)కు ముందు నాలుగేళ్ల తెలంగాణలోనే చదివి ఉండాలని చెబుతోందని, ఈ నిబంధన రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని గతంలో ఇదే కోర్టు అభిప్రాయపడిందని, ఇలాంటి నిబంధనను తప్పుబడుతూ గతంలో సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఉత్తర్వులు కూడా ఇచ్చిందని పిటిషనర్ గుర్తుచేశారు. శాశ్వత నివాసితులైన విద్యార్థులను ‘స్థానిక’ంగానే పరిగణించాలని స్పష్టం చేసిందని, ఈ తీర్పును తనకు కూడా వర్తింపజేయాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్‌కు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమని గత విచారణ సందర్భంగా చెప్పిన ధర్మాసనం.. స్థానికంగా లేకున్నా విద్యార్థి 18 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నట్లు సర్టిఫికెట్ ఎలా ఇచ్చారో చెప్పాలని తహసీల్దార్‌ను ఆదేశించింది. మంగళవారం తహసీల్దార్ హాజరుకాకపోవడంపై అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం.. బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.